# పనికిమాలినోడు

"నీ పేరేనా ఇది?" అడిగాడా ఆగంతకుడు అతని చిరునామా రాసిన కాగితాన్ని చూపుతూ.

సాయంత్రం చీకటి పడుతోంది. వచ్చిన వ్యక్తి తనకు పరిచితుడు కాదు. 'అడ్రసు తెలీక వచ్చాడేమోలే' అనుకున్నాడు వెంకటేశం.

"అవును, నాదే. ఏందిట్లా తప్పుగా రాశావు? వెంకటేశం బదులు ఎంకటేసం రాశావు! నాలుగక్షరాల పేర్లో రెండు తప్పులా? ఎట్లా బాగు పడతారయ్యా మీరు! పేర్లట్లా తప్పుగా రాయకూడదు...." పంతుళ్ళ చాదస్తమంతా బయట పెట్టుకున్నాడు, వెంకటేశం అలా తప్పుగా రాసిన వ్యక్తిని మందలిస్తూ.

"ఎందుకు రాయగూడదంటా?నీ పేరని తెలిసినాదా లేదా? మనకి పని గావాల, తప్పో తడకో ...."

"నీ ఇష్ట మొచ్చినట్టు నీ పేరు రాసుకో. నా పేరు అట్లా రాస్తే ఊర్కోను!" అన్నాడు వెంకటేశం.

"నీ బోటోళ్ళు అందుకనే బాగు పడరు, ఇతర్లని బాగు పడనీరు.... కోన్ కిస్కా గొట్టం పేరొకటి పెట్టుకున్నావు. ఇంతోటి పేర్ల తప్పులంట! ఏం మనిషివయ్యా!"

'ఆ మనిషి తనను తిట్టటానికే వచ్చినట్టున్నాడు! అట్లాంటి మనుషులతో ఏం మాట్లాడీ ప్రయోజనం లేదు' అనుకున్నాడు వెంకటేశం.

"సర్లే, ఇంతకీ ఎందుకొచ్చినావు?"

"ఇదేంది? నీదేనా?" అన్నాడు ఆగంతకుడు ఓ కాయితం అతనికి చూపెడుతూ.

"నాదే. ఎన్నేళ్ళబట్టో నా పేరు ఓటర్ల లిస్టులో ఉండినాది. మరిప్పుడు లేదు. ఎందుకు తీసేసినారో తెలీదు. నా పేరు ఓటర్ల లిస్టులో ఇన్‌క్లూడ్ చెయ్యమని నేను ఇచ్చిన అప్లికేషనది. నీ చేతికెట్లా వచ్చినాది..."

"మా బాస్ వాపసు తీసుకొచ్చిండులే. నర్సింగన్న తెల్సుగందా? నీ పేరు మేమే తీయించినాం. మా అన్న – నీ అసుంటి పనికిమాలినోళ్ళ అప్లికేషన్లు వాపసు చేయమనుండె, మల్లా అప్లయి చెయ్యకుండ వార్నింగిచ్చి రమ్మనుండె. నీ అప్లికేషనిచ్చి, నీకు సమఝాయించి పోదమని వచ్చినా."

"నేను పనికిమాలినోణ్ణా..........?"

ఆపైన వెంకటేశాన్ని మాట్లాడనివ్వలేదు ఆగంతకుడు.

"మరి? నీ ఇంటి ప్లాను శాంక్షను అయినాదా?"

"కాలేదు. నీకెట్లా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగాడు వెంకటేశం.

"నువ్వు రెండో గ్యాసు సిలిండరుకు అప్లయి చేసినావు. వచ్చినాదా?"

"రాలేదు..." అన్నాడు నోరు తెరచి వెంకటేశం.

"బతకలేని బడిపంతులివి. అంతే గందా?"

"లెక్చరర్ని! గౌరవనీయమయిన వృత్తి ఉపాధ్యాయ వృత్తి! తీసేసినట్టు మాట్లాడక!" అన్నాడు గర్వంగా వెంకటేశం.

"అబ్బో, చెప్పకు. అసలు మీరు పాటాలు చెప్పిందెప్పుడయ్యా? జనాభా లెక్కలకు మీరే, ఓటర్ల నమోదుకు మీరే, ఏ అమాంబాపతు పనికయినా మీరే! పాటాలు చెప్పెడి తీరికెక్కడ మీకు?"

అతనన్న మాట నిజమే. అందుకే బదులు పలుకలేక పోయాడు వెంకటేశం.

"ఇంతకీ నీ పేరేంది?" అడిగాడు.

"యాదగిరి అనుకో."

"సరే, నా సంగతంతా నీకెట్లా తెలుసు?" అడిగాడు వెంకటేశం.

"మాకు తెలవందేంది? నీకు రేషనోళ్ళు పింక్ కార్డు ఇచ్చిన్రు. నువ్వు తెల్ల కార్డు సంపాదించగలవా? సర్కారీ దఫ్తర్ల పైస కర్చుబెట్టకుండ పని చేయించుక రాగలవా? కరీంనగర్ల ఉన్న నీకొడుకుని హైదరాబాదుకు బదిలీ చేయించ గలవా? నువ్వు బతుకంతా పోరాడి సాదించిందేందయ్యా? ఏం లేదు. నువ్వు కూడబెట్టుకున్నది చేతగానితనం. అందుకు పొగరెందుకు? నేను పనికిమాలినోడు అంటే కోపమెందుకు? అసలు నీకు ఓటెందుకు – మురగబెట్టటానికా, ఇంకో పనికి మాలినోడికి ఎయ్యటానికా?"

వెంకటేశానికి అతనన్న మాటలు నిజమే ననిపించాయి. అయితే, అతనికి కోపం కూడా వచ్చింది. ఓటెందుకు అని ప్రశ్నించి నందుకు కాదు. తన చేతగానితనపు వర్తనను అంతగా ప్రదర్శించి చూపినందుకు. అందుకే కోపంతో గొంతు పెంచి,“నా ఓటు నా ఇష్టం! మురగబెట్టుకుంటానో, పనికి మాలినోడికేస్తానో నీకనవసరం” అన్నాడు.

“మద్య తరగతోడికి బుర్రలేదని ఊర్కే అనలే!....ఆడసలు మడిసే కాదు. ఆడికి ఓటెందుకు?”

“నేను ఇరవైయ్యేళ్ళు వోటేసినా, ఇప్పుడు మీరొచ్చి నా పేరు తీయిస్తరా? నేనూర్కుంట నేంది? ఇప్పుడు నువ్వు కాయితం వాపసు తెస్తే ఏమవుతది, మళ్ళీ అప్లయి చెయ్యనా?”

యాదగిరికి కోపమొచ్చింది. తమాయించుకుంటూ,“నేనొకటి అడుగుతా, జవాబు చెప్పు. ఇన్నేళ్ళు నువ్వు వోటేసినావు గందా! ఒక్కసారయినా నువ్వు ఓటేసినోడు గెల్చినాడా?” అని అడిగాడు.

“అవును. నీకెట్లా తెల్సు?”

“మీ మద్య తరగతోళ్ళ బతుకుల సంగతి మాకు తెలియదేంది! ఇదివరకు మీవోట్లు మేమే ఏసుకునెటోళ్ళం. ఇప్పుడేందో వోటరు ఐడెంటిటీ కార్డులు వచ్చినాయంట! ఎపిక్‌లంట! ఆ గోలంతా ఎందుకు- మీబోటోళ్ళకు వోటు లేకుండా చేస్తే సరిపోతది కదా- అన్న కొత్త ఆలోచన మా అన్నకొచ్చినాది. అందుకే నీ అప్లికేషను వాపసు తెచ్చినా, నీకు సమఝాయించటానికొచ్చినా” అన్నాడు యాదగిరి.

“ఏం సమఝాయిస్తవో, సమఝాయించు.”

“ఒక పార్టీ రెండు రూపాయల కిలో బియ్యం, ఆరోగ్య శ్రీ పథకం అంటుండె. ఇంకో పార్టీ కలర్ టీవీలు ఉచితంగా ఇస్తనంటుండె. నగదు బదలాయిపు పథకం కూడ ప్రవేశ పెడ్తరంట! ఇంకొక పార్టీ వంద రూపాయల్లో రేషనూ, బియ్యమూ ఇస్తననుండె. రెండు నుండి ఐదెకరాల పొలం కూడ ఇస్తరంట! ఎన్నికలొస్తవంటె పండగే పండగ ! నీ లాంటి మద్య తరగతోడు.......”

“ఎవడబ్బ సొమ్మని బిచ్చం ఏసెటందుకు? జనం పకీర్లా, నీ తాన జోలె సాచెటందుకు? మన కర్మ కాలి అళ్ళంతా కల్సి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, ఆళ్ళు చేసిన వాగ్దానాలు నిలబెట్టుకుంటే, మనది దౌర్భాగ్యపు బతుకే అవుతది. దున్నేందుకు భూమి,ఉండేందుకు ఇల్లు, ఉచిత కరెంటు, నీళ్ళు, వైద్యం, బట్టలు, బియ్యం, సరుకులు, పిల్లల ఫీజులు, కలర్ టివిలు- కాలుమీద కాలు, నోట్లో వేలు! మహారాజ భోగమే ననుకో.

ఈటన్నిటికీ పైసలేడ నుండొస్తయ్! నువ్వాళ్ళనడుగు. ఇదుగో, యాదగిరీ, నీకు ఎకనమిక్సు తెలవదయ్యా, ఈ ప్రపంచంల గాలి తప్ప ఫ్రీగా ఏం దొరుకతది? అన్నీ కష్టపడి సంపాదించు కొనాల్సిందే...."

యాదగిరి అతని ఉపన్యాసాన్ని కొనసాగనివ్వలేదు.

"నీ కడుపు మంట నాకు తెల్సు. మెజారిటీ సంఖ్యలో వున్న అన్ని బడుగు బలహీన వర్గాలకూ అన్ని రాజకీయపార్టీలూ సంక్షేమ పథకాలను ప్రకటిస్తుండె. ఇంక వోట్లేసే రోజొస్తున్నదంటే పండగే. ఆమ్ ఆద్మీ అంటే రాజు. ఇచ్చిన డబ్బు జేబులో పెట్టుకుంటడు, సారా బిగిస్తడు. 'తు ఖుష్, హమ్ ఖుష్' అన్న పరిస్థితి ఆడిది. పై వర్గంవాడూ రాజే. ఆడికీ ఏ పథకాలూ అక్కర్లేదు. ఆడికి తెల్సు– సర్కారుతో తన పనులెట్లచేయించుకోవల్నో. అందుకే ఏ పార్టీ అధికారంలో ఉండినా ఆడికిబ్బంది లేదు, ఏ పార్టీనీ ఆడు విమర్శించడు. వచ్చిన తంటా అల్లా నీతోనే. నీకెవడూ ఏమీ ఇవ్వ జూపడని నీ కడుపుడికి పోతుంటాది..."

"నాకెవడూ బిచ్చమెయ్యాల్సిన పనిలేదు. నా తిండి నేను తింటాను. స్వాభిమానంతో బతుకుతాను. ఇప్పుడు కొన్ని పార్టీలు మొదలెట్టినాయి– ఆర్థికంగా వెనకబడిన వర్గాలకుకూడా ఏదోచేస్తమని. అన్ని రాజకీయ పక్షాలకూ నా నివేదన ఒకటే– మీరు మాకెవరికీ ఏం చెయ్యొద్దు. కష్టపడి పని చేసి బతుకుతాం. సులువుగా మాకు అందాల్సిన సేవలు అందేటట్లు చూడండి. రోడ్లు వేయించండి, నల్లాల్లో దినమూ నీళ్ళొచ్చేట్టు చూడండి. సేద్యానికి నీరు లభించేట్టు చెయ్యండి. విద్యుత్తు పుష్కలంగా లభించాలి. ఉద్యోగావ కాశాలు పెంచండి. ధరలు అదుపులో పెట్టండి. మీరేదీ మాకు ఊర్కే ఇవ్వాల్సిన పని లేదు...."

అలా వెంకటేశం మాట్లాడుతుంటే యాదగిరి పకపకా నవ్వాడు. ఉగ్గబట్టుకుంటూ, "నువ్వే లోకంలో ఉన్నావేంది? ఇది ఇండియా నయ్యా, యుకెనో, యుఎస్ఎనో కాదు. ఈడ వోటు పుక్కటికెయ్యరు. మనోళ్ళు తెలివి మీరినోళ్ళు. నీకు వోటు ఇస్త, మరి నాకేమిస్త అనెటోళ్ళు. ఆళ్ళనేది కూడ కరెక్టే. ఆడు ఎన్నికై కోట్లు కూడబెడతడు. ఆమ్ ఆద్మీకి వోటేసినందుకు ఐదొందలో, వెయ్యో ఇస్తే తప్పేంది!"

"ఓర్నీయవ్వ! ఏం మాట్లాడుతున్నావో, తెలిసే మాట్లాడతన్నావా? వోటు హక్కు విలువైనది. దాన్ని అమ్ముకో కూడదు. ఇప్పటికే ప్రజాస్వామ్యం కుళ్ళిపోయినాది. రాజకీయ పక్షాలు వోటుబ్యాంకు పాలిటిక్స్ అమలులో పెట్టినాయి. మైనారిటీ వర్గాలను సంతృప్తి పరచి వోట్లు దండుకోవాలని చూస్తుండె పార్టీలు. సెక్యులర్ దేశమని చెప్పుకుంటూనే, హజ్ యాత్రలకు సబ్సిడీ లిస్తరు, జెరూసలం తీర్థయాత్రకూ రాయితీ లిస్తరు. ఇంక

మనదేం లౌకికవాద దేశం. వీర సెక్యులర్ పార్టీలని చెప్పుకునే వామపక్షాలూ ఈ ఊసెత్తవు. వాళ్ళదీ వోటుబ్యాంకు పాలిటిక్సే....."

ఇంక వెంకటేశాన్ని మాట్లాడనివ్వ లేదు యాదగిరి.

"అమ్మో నువ్వు డేంజరస్ మనిషివున్నావు. నువ్వు బిజెపి వోడివా, బజరంగ్‌దళ్ మనిషివా? మా నర్సింగన్న అప్పుడే చెప్పిండు. 'గిట్ల మాట్లటెడోళ్ళంతా మతమౌఢ్య మున్న మనుషులే. మహా పనికిమాలినోళ్లు, ఈళ్ళకు ఓటుహక్కే ఉండరాదు. ఈళ్ళని ముందుగా వోటర్ల లిస్టు నుండి తొలగించాలి' అని. అమ్మో! ఆదు తక్కువ్వోడు కాదు. ఆవులిస్తే పేగులు లెక్కబెడతాడు....."

"ఇదేనమ్మా, మీతో తంటా! వోటుబ్యాంకు పాలిటిక్స్ గురించి మాట్లాడితే చాలు బిజెపి అనో, బజరంగ్‌దళ్ అనో, విహెచ్‌పి అనో ముద్రవేస్తారు. ఉన్న నిజం పలికితే మతమౌఢ్యం లేబుల్ అతకేస్తరు. ఆళ్లూ మీలాటోళ్ళే. అంతా ఒక తానులోని ముక్కలే. నీతో మాట్లాడటం దండగ. మనసు మూసి పెట్టుకున్నవాడితో ఏం మాట్లాడగలం! సరే ఆ కాయితమిచ్చి, నువ్వు వెళ్ళు" అన్నాడు వెంకటేశం.

అంతే, వోటర్ల లిస్టులో తన పేరు నమోదుచెయ్యమని తను పెట్టుకున్న అప్లికేషన్ను పరపరా ముక్కలు చేసి, ఉండచుట్టి వీధిలోకి గిరవాటెట్టాడు యాదగిరి.

"ఏందా దుర్మార్గం?!" అని విస్తుపోతూ, నోరు తెరిచాడు వెంకటేశం.

"మంచోడ్ని కనక చెప్తున్న. వినుకుంటే నీ ఒంటికి మంచిది! నువ్వు మళ్ళా అప్లికేషను పెట్టినవా, మాకు తెలుస్తది. అప్పుడొచ్చి, నీ కాయితాన్ని చింపేసినట్టే నిన్నూ చింపేస్త. పనికిమాలిన మధ్య తరగతోళ్ళకు ఓటు ఉండకూడదని మేం తీర్మానించినం. ఇంక నీకీ జన్మకు ఓటుహక్కు లేదు. ఖబడ్దార్ !" అని ధంకీ ఇచ్చి వెళ్ళిపోయాడు యాదగిరి.

అతనో క్షణం హతాశుడయ్యాడు. తేరుకుని, 'ప్రజాస్వామ్యం చక్కగా పరిఢవిల్లుతోంది ఈ దేశంలో ' అనుకుంటూ వెనక్కు తిరిగిన వెంకటేశానికి, తన భార్య గుమ్మానికానుకుని ఇప్పటిదాకా యాదగిరితో జరిగిన సంభాషణ వింటోందని అర్థమయింది.

"మంచిగ చెప్పిండు ఆ మనిషెవరో! మనకెందుకయ్యా వోటు అంటే విన్పించుకోవు. అసలు నువ్వెప్పుడైనా వోటేసినవా? ఎన్నికల డ్యూటీ నీకు తప్పదు. ఇంతోటి దానికి ఆ మనిషి చేత అన్ని మాటలు పడవల్నా?" అంది.

"ఎన్నికల డ్యూటీ ఉంటే మాత్రం, వీలయినప్పుడల్లా ఓటేయటంలా? ఈ బద్మాష్‌లు అప్లయి చెయ్యొద్దన్నమాత్రాన నేనాగుతాననుకుంటివా? ఆ నర్సింగన్న పైనా, యాదగిరి పైనా నేను అధికారులకు కంప్లయింట్ చేస్తాను" అన్నాడు వెంకటేశం.

"బొక్కలిరిగి మూలపడితే నీకు సేవ చెయ్యలేక నేనడ్డం పడతాను. అసలు నీ కెందుకయ్యా ఈ గోలంతా? ప్రజాస్వామ్యం, ఓటు హక్కు అంటూ గోలచేస్తవు. మీటింగులంటవు, జనచైతన్య ప్రచారాలంటవు! నన్ను నువ్వు సుకాన బతకనిచ్చేట్టు లేవు" అంది ఇందిర గిరుక్కున తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోతూ.

వెంకటేశం కూడా లోపలి కెళ్ళి టివి తెరచి వార్తలు చూశాడు. కళ్ళు తెరపైనే ఉన్నాయి కానీ మనసు ఎక్కడో ఉంది. ఇదివరకూ ఇలాంటి ధంకీలను విన్నాడు కానీ, ఇప్పటిది కొత్తగా ఉంది. ఇదివరకు బూత్ కాప్చరింగ్, ఇమ్‌పర్సనేషన్ లాంటి దుర్మార్గాలకు తెగబడుతుండేవి అసాంఘికశక్తులు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే మధ్య తరగతి వర్గానికే ఓటుహక్కు లేకుండా చెయ్యాలని నిశ్చయించుకున్నారన్న మాట! ఈ శక్తులతో తను తలపడగలడా? మధ్య తరగతి వర్గం సంఘటితం కాదు. వాళ్ళు వ్యక్తులే! కొంచెం భయం కూడా వేసింది వెంకటేశానికి.

మనసులో ఏవేవో ఆలోచనలు వచ్చాయి. లేచి, టేబుల్ దగ్గర కూర్చుని టేబుల్ లైటు ఆన్ చేశాడు. తన ఆలోచనలను కాయితం మీద పెట్టే ప్రయత్నం చేశాడు. శిక్షణ పొందిన మనసు అతనిది. ఆలోచనలు ఓ క్రమరూపాన్ని సంతరించుకుని కాయితాల మీద నిక్షిప్తమవ సాగాయి: "నదీ తీర ప్రాంతాల్లో, లోయల్లో మొదటగా జనావాసాలు ఏర్పడ్డాయి. నేల, నీరు, గాలి కావలసినంత లభించేవి. పోటీ లేదు. జనాభా పెరగటంతో జనాలు నదులకు ప్రత్యామ్నాయాలుగా బావులు, జలాశయాలు ఏర్పరుచుకుని అక్కడ నివశించ సాగారు. తమకు నచ్చిన వృత్తిని అవలంభించేవారు. నేల, నీరు దొరకటం కష్టమయ్యే సరికి సమ న్యాయం జరపటం కోసం నాయకులు పుట్టుకొచ్చారు.అప్పుడే అసమసమాజానికి, ఫ్యూడల్ వ్యవస్థకు, రాచరికానికి పునాదులు పడ్డాయి. కలిగిన, లేని వర్గాలు ఏర్పడ్డాయి. ఉన్నవాళ్ళకోసం నాగరికత పరిఢవిల్లింది. వారి జీవితం సుఖ శాంతులతో గడవసాగింది. ప్రకృతి శక్తుల పట్ల మనిషికి అనాదిగా భయం. తాను వాటిని అదుపులో పెట్టలేడు. అప్పుడు అతీతశక్తిగా మొదలయిన భావన మతంగా రూపు దిద్దుకుంది. సంస్కృతి సంప్రదాయాలు ఏర్పడ్డాయి. ఓ వైపు పరిమితమయిన వనరులకోసం ఫ్యూడల్ సమాజాల మధ్య పోరాటాలు ప్రారంభమయితే, మరో వైపు భిన్న మతభావాల

మధ్య ప్రాబల్యాలబ్ధి కోసం పెనగులాటలు మొదలయ్యాయి........" అలా సాగింది అతని వ్యాసం.

ఇలా వ్యాసాలు, కథలు, కవితలు గట్రా రాసుకోటం అతనికి అలవాటే. తాత్త్వికులు, చింతనాపరులు మధ్య తరగతికి చెందినవాళ్ళే. క్రింది తరగతికి ఆ అవకాశం లేదు, పై తరగతికి ఆ అవసరంలేదు. మధ్య తరగతి ఆలోచనలతోనే సమాజం పురోగమిస్తూ ఉంటుంది. వెంకటేశానికి అది తప్పనిసరి వ్యవసాయం. ఆవేశం కలిగినప్పుడల్లా అతనలా రాస్తుంటాడు, పత్రికలకు పంపిస్తుంటాడు, ప్రచురితమైనప్పుడు సంతోషిస్తుంటాడు.

భర్త టేబుల్ దగ్గర కూర్చుని రాసుకుంటుంటే ఇందిరకు సంతోషంగా వుంటుంది. అది ప్రమాద రహితమైనవ్యవసాయం అని ఆమె అభిప్రాయం. అలాంటి పనిలో అతను నిమగ్నమైనప్పుడు ఆమె అతని ఏకాగ్రతకు భంగం కలగకుండా ప్రవర్తిస్తుంటుంది.

వెంకటేశం రాసుకోటం చూసి ఇందిర ప్రాణం కుదుట పడ్డది. 'ఈ పనికిమాలిన రాత పని ఉంది గనకే తను బతికి పోతున్నది. లేకపోతే ఏదో లొల్లి కొంపమీదకు తీసుకరాడూ? ఆ మనిషెవరో మంచిగనే చెప్పిండు- తనమగడు లాంటోళ్ళు పనికిమాలి నోళ్ళని! డబ్బుకు లొంగడు, తాగుడికి లొంగడు. ఈళ్ళు సాదించేదేందంట!' అని నిట్టూర్చింది ఇందిర.

అంతలో ఆమెకు తన తండ్రి చెప్పిన మాట గుర్తు కొచ్చింది.

"నీ మొగుడికి జరగింత ఆవేశం ఎక్కువ. ఆలోచనలూ ఎక్కువే. నువ్వు గుబులు పెట్టుకోమాక. ఆలోచించెటోళ్ళు ఏపనీ చెయ్యలేరు. ఇంక రచనలు చేసెటోళ్ళతో అస్సలు ప్రమాదం లేదు. ఆలోచనలు కాయితం మీద పెట్టేసరికి ఆళ్ళ ఆవేశమంతా చల్లారిపోతది. నీ మగడు రాసుకుంటుంటే మాత్రం నువ్వు డిస్టర్బ్ చెయ్యమాక. అది గుర్తుంచుకుని నడచుకున్నావంటే నీ లైఫ్ సుఖంగ గడచి పోద్ది."

తండ్రి మాటల భరవాసాతోనే ఆమె జీవితం వెళ్ళమారుస్తున్నది. 'నాలుగు రోజులు సెలవ పెట్టించి కొడుకు దగ్గరకు కరీంనగరు వెళ్ళొస్తే సరి! ఈ లోగా ఓటు ఆవేశం కొంత శాంతించ వచ్చు' అనుకుంది ఇందిర. అనుకున్నదే తడవుగా ఆ ఆలోచనను అమలులో పెట్టింది.

పది రోజులు సెలవు పెట్టి కొడుకుండే కరీంనగరెళ్ళొచ్చాక, ఓటుకోసం మళ్ళా అభ్యర్థన పంపకుండా నాలుగు రోజులు తాత్సారం చేశాడు వెంకటేశం..'వాడు – ఆ యాదగిరి చించేస్తానన్నాడు. ఈ వయసులో బొక్కలిరిగితే అతుక్కోటం కష్టం' అనుకుంటూ

పస్తాయించాడు. అయితే, తనే సృజించుకున్న మిథ్యాహంకారపు ఊబి నుండి ఎలా బయటపడాలో అతని కర్థం కాలేదు. అంతలో ఓటు నమోదుకు అభ్యర్థన పంపే సమయం మించిపోయింది. అలాంటి సమయంలో అతన్ని ఎన్నికల విధులలో నియమిస్తూ పంపిన ఆదేశ పత్రం అందింది.

ఆ రోజు బయటకెళ్ళబోతూంటే, "ఎక్కడికి? మళ్లా ఓటుకి అప్లికేషనెయ్యటానికా?" అని అడిగింది ఇందిర.

"లేదు. ఎలక్షను డ్యూటీ పడిందిగా? డ్యూటీల ఉంటే ఓటెయ్యటంకూడా కష్టమే. ఈ సారికి చూసుకుందామని ఆగినా. కరీంనగరెళ్లటంతో టైము కూడా అయిపోయినాది. మరేం చేస్తాం" అని జవాబిచ్చాడతను.

"మంచి ఆలోచన!" అని నవ్వింది ఆమె.

ఆ చూపులో 'పనికిమాలినోడు' అన్న తిరస్కార భావన ఉందేమోనన్న సందేహం కలిగిందతనికి. ఆ ఆలోచన నిజమే నన్న మనస్తాపమూ కలిగింది. అతను నిస్సహాయుడు. మంచి ఆలోచనలున్న వాళ్ళందరూ ఉద్యమాలు నడపలేరు కదా! అతను సగటు మధ్య తరగతి మనిషి!

*ప్రజాతంత్ర (వార పత్రిక, 02 ఆగష్టు 2009*